క్లుప్తంగా

ఎస్పీని కలిసిన సీఐ రాజు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ రాజు

ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలోని ఎస్పీ సురేశ్‌కు మార్‌ను ఆయన కార్యాలయంలో సీఐ రాజు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రానికి ఇటీవల బదిలీపై వచ్చిన సీఐ ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా సీఐని అభినందించారు.

పాత్రికేయులు ప్రజల వారధులు



ప్రెస్‌క్లబ్‌ను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

దహెగాం: పాత్రికేయులు ప్రజలకు ప్రభుత్వానికి వారధులని ఎంపీపీ సులోచన, జెడ్పీటీసీ సభ్యుడు టి.రామారావు అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రెస్‌క్లబ్ భవనాన్ని సోమవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరు విషయంపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామన్నారు. అంతకు ముందు ఒగ్గుడోలు కళాకారులు చేసిన సాంస్కృతిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. జర్నలిస్టు సంఘాల కన్వీనర్లు రహమాన్, రవినాయక్, నవోదయ ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షురాలు మంజుల, టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి, అంగన్‌వాడీ సంఘం రాష్ట్ర కార్యదర్శి త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట

బెజ్జూర్: మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జెడ్పీటీసీ పంద్రం పుష్పలత అన్నారు. మండల కేంద్రంలో సోమవారం మత్స్యకారుల కుల సంఘం భవనానికి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సిడాం సకారాం, పీఏసీఎస్ మాజీ చైర్మన్ డోకే వెంకన్న, సర్పంచులు భుజాడి శేఖర్, కుమురం హన్మంత్, సిడాం భీంరావ్, ఎంపీటీసీలు పర్వీన్ సుల్తానా జావిద్, లంగారి శ్రీను, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ దందేరా ఇస్తారి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే గ్రామాలు అభివృద్ధి



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

రెబ్బెన: బీఆర్ఎస్ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని ఎంపీపీ జుమ్మిడి సౌందర్య అన్నారు. మండలంలోని మద్దాయిగూడ గ్రామంలో రూ.5 లక్షల ఎంపీపీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ డోబే పార్వతి, ఉప సర్పంచ్ గోపాల్, పంచాయతీ కార్యదర్శి నరేశ్, బీఆర్ఎస్ నాయకులు జుమ్మిడి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పెంచికల్‌పేట్: మండలంలోని పెంచికల్‌పేట్ కమ్మర్‌గాం పంచాయతీలో సోమవారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. 10 లక్షల నిధులతో పనులు చేపడుతున్నట్లు సర్పంచులు తెలిపారు. సర్పంచులు మధునయ్య, కమల, నాయకులు పాల్గొన్నారు.

ధ్యానమందిర నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న నాయకులు

కెరమెరి: మండలంలోని మోడి గ్రామంలో సోమవారం శ్రీ సద్గురు పులాజీ బాబా ధ్యాన మందిర నిర్మాణానికి జెడ్పీటీసీ దుర్పత బాయి, ఎంపీపీ పెందోర్ మోతీరాం భూమి పూజ చేశారు. జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో నిర్మిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సిద్దేశ్వర్ సంస్థాన పట్నాపూర్ అధ్యక్షుడు కేశవ్, నాయకులు భగవంత్‌రావు, కావ్‌డే తుకారాం, ఆత్రం భుజంగ్‌రావు, జానకిరాం, నికోడే సోనాజి తదితరులు ఉన్నారు.

చెట్ల కింద చదువులు

- కూలిన వీరవెల్లి ప్రాథమిక పాఠశాల గోడ
- రహదారి సమీపంలో చెట్లనీడలో పాఠాలు
- ఇబ్బందుల్లో విద్యార్థులు
- కొన్ని పాఠశాలలకు ప్రహరీలు లేవు
- పట్టించుకోని అధికారులు



చెట్టు కింద విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న టీచర్

కౌటాల: మండలంలోని సర్కార్ బడులు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. శిథిలావస్థకు చేరిన తరగతి గదులు, ఉపాధ్యాయుల కొరత, అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు వంటి సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వీరవెల్లి ప్రాథమిక పాఠశాలలో మొత్తం 60 మంది చదువుతున్నారు. వీరికి ఇద్దరు టీచర్లు పాఠాలు బోధిస్తున్నారు. రెండు గదుల్లో అరకొర వసతుల నడుమ చదువులు కొనసాగిస్తున్నారు. కొత్తగా ఏర్పడిన వీరవెల్లి పంచాయతీకి సొంత భవనం లేకపోవడంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనంలో ఓ గదిలో కొనసాగిస్తున్నారు. గతనెల 21న కురిసిన భారీ వర్షాలకు జీపీ భవనం కూలడంతో ఆ గదికి అనుకొని ఉన్న పాఠశాల గోడలు కూలిపోయాయి. దీంతో గ్రామంలో చెట్ల కింద విద్యార్థులు చదువులు సాగిస్తున్నారు. ఎస్ఎంసీ చైర్మన్ రౌతు సంతోష్ ఇంటి రేకులషెడ్‌లో కొందరు విద్యార్థులు, ప్రధాన రహదారి సమీపంలోని చెట్టు నీడలో టీచర్లు పాఠాలు చెబుతున్నారు. రోడ్డు సమీపంలో ప్రమాదం జరిగే పరిస్థితి ఉండడంతో స్థానిక సర్పంచ్ ద్రౌపతి ఇంటి ఆవరణలో చదువుకుంటున్నారు. పిల్లలు చదువుకునేందుకు గ్రామంలో రోజుకో చోటుకు మారాల్సిన పరిస్థితి ఏర్పడిందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.



కూలిన పాఠశాల గోడ

పాఠశాలల్లో సమస్యలు..

మండలంలోని ఆయా పాఠశాలల్లో సరైన మరుగుదొడ్లు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. వారి సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు నిర్మించలేదు. ఉన్నవి శిథిలావస్థకు చేరగా, నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా మరికొన్ని మారాయి. శిథిలావస్థకు చేరిన భవనాలు ఓ క్షణాన కూలుతాయోనని భయం ఇటు విద్యార్థులు, అటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను వెంటాడుతోంది.

మరమ్మతు చేపట్టాలి



భారీ వర్షాలకు మా పాఠశాల తరగతి గోడ కూలింది. టీచర్లు చెట్టు నీడలో పాఠాలు బోధిస్తున్నారు. వర్షం పడితే ఇంటి వద్ద ఉంటున్నాం. అధికారులు పాఠశాల గదికి మరమ్మతు చేయించాలని, అలాగే నూతన భవనం నిర్మించాలి.

– ఆర్.అనూష, విద్యార్థిని

పిల్లలు ఇంటి నుంచే వాటర్ బాటిళ్లు తెచ్చుకుంటున్నారు. కొన్ని పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. పశువులు, వీధి కుక్కల సంచరించడంతో ఆవరణంతా కంపుకొడుతున్నాయి. ఇప్పటికైన జిల్లా అధికారులు స్పందించి విద్యార్థుల ఇబ్బందులు దూరం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో హాజరు వేయాలి

కెరమెరి: ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో హాజరువేయాలని మండల నోడల్ అధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో హెచ్ఎంలకు సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎఫ్ఆర్ఎస్‌లో యాప్‌లో రిజిస్ట్రేషన్ అయిన విద్యార్థులు హాజరువేయాలన్నారు. ఇక నుంచి ఆ హాజరే పరిగణనలోకి తీసుకుంటామన్నారు. రిజిస్ట్రేషన్ బాగున్నప్పటికి హాజరులో మనం వెనకబడి ఉన్నామన్నారు. నేటి సాయంత్రం వరకు డ్రాప్ బాక్స్ క్లీయర్ కావాలని, అందుకు హెచ్ఎంలు చర్యలు తీసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న ఆడే ప్రకాశ్

అనార్‌పల్లి హెచ్ఎం బలిరాం, కెరమెరి క్లస్టర్ నోడల్ అధికారి భరత్‌రావు, ఎస్సీఆర్పీ నరేశ్, మోడి పీఎస్ హెచ్ఎం గంగారాం, ఎంఐఎస్ అశ్విని ఉన్నారు.

జనగర్జన విజయవంతం చేయండి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అజ్మీరా ఆత్మారామ్‌నాయక్

ఆసిఫాబాద్‌అర్బన్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించే జనగర్జన సభను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అజ్మీరా ఆత్మారామ్‌నాయక్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సభకు కేంద్రమంత్రి అమిత్‌షా హాజరవుతారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. నాయకులు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి: జనగర్జన సభను విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు పులి వెంకటేశ్, అసెంబ్లీ కోకన్వీనర్ సార రమేశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రజలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. మండల ప్రధాన కార్యదర్శి ఆత్రం గోపాల్, ఎస్టీ మోర్చా జిల్లా కార్యదర్శి వల్క శ్రీధర్, నాయకులు తిరుపతి, కోట్నాక కుమార్, వెడ్మ మధుకర్, గేడం రవి, దశ్వంత్ ఉన్నారు.

రెబ్బెన: జన గర్జన సభను కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలిరావాలని బీజేపీ అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ కోరారు. గోలేటిలో సోమవారం ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ మోసపూరిత మాటలను నమ్మి ప్రజలు మరోసారి మోసపోవద్దన్నారు. నాయకులు లక్ష్మి, శంకర్, దుర్గం శంకర్, మార్పల్లి శంకర్ పాల్గొన్నారు.

టెక్నీషియన్లకు సూటబుల్ ఉద్యోగాలు ఇవ్వాలి

- హెచ్ఎంఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు ఓజియార్

రెబ్బెన(ఆసిఫాబాద్): మెడికల్ అన్‌ఫిట్ అయిన టెక్నీషియన్, ఈపీ ఆపరేటర్లకు సూటబుల్ ఉద్యోగాలు కల్పించాలని హెచ్ఎంఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు ఓజియార్ డిమాండ్ చేశారు. గోలేటి టౌన్‌షిప్‌లోని తమ యూనియన్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత సంవత్సరం ఏప్రిల్‌లో అన్ని కార్మిక సంఘాలతో జరిగిన ఒప్పందంలో యాజమాన్యం మైనింగ్ సిబ్బంది, టెక్నికల్ సూపర్‌వైజర్లు, ఫోర్‌మెన్స్‌లు, టెక్నీషియన్లు, ఈపీ ఆపరేటర్లకు మెడికల్ అన్‌ఫిట్ అయితే సూటబుల్ జాబ్ ఇచ్చేలా యాజమాన్యం అంగీకరించిందన్నారు. ఆ ఒప్పందాన్ని పక్కనపెట్టి తాజాగా మైనింగ్ సిబ్బందికి, టెక్నికల్ ఫోర్‌మెన్లకు మాత్రమే మెడికల్ అన్‌ఫిట్ అయితే సుటేబుల్ ఉద్యోగం ఇచ్చేలా యాజమాన్యం సర్క్యూలర్ జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. సమావేశంలో ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు, జిల్లా అధ్యక్షుడు ఎండీ గౌస్, ఫిట్ కార్యదర్శి రమేశ్, గోలేటి హాస్పిటల్ ఇన్‌చార్జి శ్రీనివాస్, ఏరియా నాయకుడు ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఓజియార్

మండల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలి

తిర్యాణి: మండల సమగ్ర అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో సత్యనారాయణ సింగ్ పేర్కొన్నారు. నీతి అయోగ్ సంకల్ప్ సప్తవ్ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వివిధ శాఖల ద్వారా అందుతున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సోమవారం స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయలు కల్పించడమే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేయాలన్నారు. ఎంపీవో జావిద్, ఏవో తిరుమలేశ్వర్, పీఆర్ ఏఈ సుహాస్, ఏపీఎం సదానందం, ఏపీవో జాకీర్ ఉస్మాని, సీడీపీవో సాధియా రుక్సాన, సర్పంచులు మడావి గుణవంత్‌రావు, కోట్నాక గణపతి ఉన్నారు.



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఉద్యోగులకు బదిలీలు సహజం

తిర్యాణి: ఉద్యోగులకు బదిలీలు సహజమని డీఈవో అశోక్ అన్నారు. మండల ప్రత్యేక విద్యాధికారిగా విధులు నిర్వహించిన సెడ్మకి రాము ఇటీవల జిల్లా కేంద్రానికి బదిలీ అయిన సందర్భంగా మండల కేంద్రంలో సోమవారం ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుంటూ మండల విద్యాభివృద్ధికి రాము చేసిన సేవలను మరువలేనివన్నారు. అనంతరం ఆయనకు పూలమాల శాలువలతో సన్మానించారు. ఎంఈవో వెంకటేశ్వర స్వామి తదితరులు ఉన్నారు.



రాము సన్మానిస్తున్న డీఈవో, ఉపాధ్యాయులు

ఎస్ఎఫ్ఐ నాయకుల ముందస్తు అరెస్ట్

కాగజ్‌నగర్‌టౌన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఎస్ఎం, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శాంతియుతంగా ధర్నాకు యత్నించగా, పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం దారుణమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్, డివిజన్ కార్యదర్శి ఆనంద్ ఆరోపించారు. సోమవారం చలో హైదరాబాద్ కార్యక్రమానికి టీఎస్ఎంలు పిలుపునివ్వగా స్థానిక ఆ సంఘం నాయకులను కాగజ్‌నగర్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. రాష్ట్రంలోని సంక్షేమ వసతిగృహ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి నాయకులు పిలుపు నివ్వగా, నాయకులు భీమేష్, తదితరులను ముందస్తుగా పోలీసులు అదుపులో తీసుకున్నారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు.



పోలీసుల అదుపులో ఎస్ఎఫ్ఐ నాయకులు

కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల ధర్నా

కాగజ్‌నగర్‌టౌన్: వేతనాలు వెంటనే చెల్లించాలని మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం వారు ధర్నా చేపట్టారు. కార్మికుల సంఘం నాయకుడు శంకర్ మాట్లాడుతూ గత నాలుగు నెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా అధికారులు, పాలకవర్గం సభ్యులు పట్టించుకోవడం లేదన్నారు. వేతన బకాయిల తోపాటు, ఇతర సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

వాలీబాల్ పోటీలు

రెబ్బెన: డబ్ల్యూపీఎస్ వార్షిక క్రీడల్లో భాగంగా గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం డిపార్టుమెంటల్ స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఖైరిగూడ పీవో జట్టు, ఎస్‌వోటూజీఎం గ్రూప్ జట్లు హోరాహోరీగా తలపడగా చివరకు పీవో జట్టుపై ఎస్‌వోటూజీఎం జట్టు విజయకేతనం ఎగురవేసింది. కార్యక్రమంలో స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మురహరిరావు, జనరల్ కెప్టెన్ చంద్రకుమార్, ఎం.వెంకటేశ్వర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అన్నివర్గాల అభివృద్ధే లక్ష్యం



చెక్కులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



బీసీ చెక్కులు అందజేస్తున్న ఎంపీపీ విశ్వనాథ్

కౌటాల: అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు సోమవారం బీసీ బంధు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులవృత్తులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం రూ.లక్ష సాయం అందిస్తోందని తెలిపారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. మండలంలోని శీర్షా గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. సర్పంచులు మౌనిక్, రమేశ్, శ్రీనివాస్, ఎంపీటీసీ మనీష్, ఉప సర్పంచ్ తిరుపతి, పార్టీ మండల అధ్యక్షుడు ఆదే వసంత్‌రావు, రైతుబంధు సమితి మండల కన్వీనర్ మెర్పల్లి బ్రహ్మయ్య, నాయకులు మధుకర్, రవీందర్‌గౌడ్, బాపు, శ్రీనివాస్, రాంచందర్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి): స్థానిక రైతువేదికలో సోమవారం లబ్ధిదారులకు ఎంపీపీ చునార్కర్ సువర్ణ బీసీ బంధు చెక్కులు పంపిణీ చేశారు. మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్ హుస్సేన్, ఎంపీటీసీ తుకారాం, సోహెల్ అహ్మద్, ఎంపీడీవో రాజేశ్వర్, ఉప సర్పంచ్ తోట మహేశ్, నాయకుడు ఇఫాత్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండలకేంద్రంలోని రైతు వేదికలో 31 మంది లబ్ధిదారులకు సర్పంచులు సోమవారం బీసీ బంధు చెక్కులు పంపిణీ చేశారు. ఎంపీడీవో గంగాసింగ్, సర్పంచులు ఉపాసె సంజీవ్, సుధాకర్, రాజన్న, కోఆప్షన్ సభ్యుడు సాజిత్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చౌదరి తిరుపతి, నాయకులు శ్రీనివాస్, బాబు, చలం, సదాశివ్ పాల్గొన్నారు.

సన్మానం

కెరమెరి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి ఇటీవల కానిస్టేబుల్ ఫలితాల్లో ఉద్యోగాలు సాధించిన ఎం.సునీత(సుర్దాపూర్), షేక్ మోసిన్(కెరమెరి)ని సోమవారం సన్మానించారు. ప్రిన్సిపాల్ ఆర్.పరుశురాములుతోపాటు నవీన్ రెడ్డి, స్వామి కుత్‌బోద్దిన్, బైరాగి, కిశోర్, శ్రీహరి, రాము, సునీల్, సరళ, కైసల్య, కారయ్య ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: అత్యవసర సమయాల్లో విధులు నిర్వర్తిస్తున్న 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ 104 ఎఫ్‌డీహెచ్‌సీ ఉద్యోగులకు వేతనాలు చెల్లించేందుకు ఏజెన్సీ విధానాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వమే ట్రెజరీ ద్వారా చెల్లించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేసి, క్రమబద్ధీకరించాలని కోరారు.

బీజేపీలో చేరిక

కాగజ్‌నగర్‌టౌన్: మండలాలకు పలువురు ఆదివాసీలు బీజేపీలో చేరారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు పట్టణంలోని తన నివాసంలో సోమవారం వారికి కాషాయ కండువా కప్పారు. పార్టీ నాయకులు మెస్రం రాజారాం, ఎలాది నారాయణ, పార్టీలో చేరిన బెజ్జూర్ మండలం కుష్ణపల్లి, కుకుడ, గబ్బాయి, హేటిగూడ, తలాయి, తిక్కపల్లి, పెంచకల్‌పేట్ మండలం గుండేపల్లి, కమ్మర్గాం, చింతలమానేపల్లి మండలం కోయపల్లి గ్రామాలకు చెందిన 120 మంది ఆదివాసీలు ఉన్నారు.

బీఎస్పీలో చేరిక

సిర్పూర్(టి): మండల కేంద్రానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు సోమవారం బీఎస్పీలో చేరారు. సోమవారం హైదరాబాద్‌లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వారికి కండువా కప్పారు. మాజీ ఎంపీటీసీ నగ్రాడె స్వాతి, సహకార సంఘం డైరెక్టర్ నగ్రాడె రాజు, వార్డు సభ్యుడు అస్లాం బిన్‌అబ్దుల్లాలతోపాటు మేస్త్రీ సంఘం మండల అధ్యక్షుడు శివరాం, మేదరి సంఘం జిల్లా జనరల్ సెక్రటరీ ప్రభాకర్ పార్టీలో చేరారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలి

కాగజ్‌నగర్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలని పట్టణ పద్మశాలీ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం అధికారికి వినతిపత్రం అందజేశారు. సంఘం ప్రతినిధులు కె.రాజమౌళి, కేదారి, కనకయ్య, మల్లయ్య, సునీత, ఎం.శ్రీనివాస్, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, జగదీశ్వర్, సత్యనారాయణ, కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బెజ్జూర్: మండల కేంద్రానికి చెందిన చింతకుంట పెంటయ్య తల్లి మృతిచెందింది. విషయం తెలుసుకున్న బీఎస్పీ రాష్ట్ర కార్య నిర్వాహక కమిటీ కార్యదర్శి అర్షద్ హుస్సేన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సోమవారం వారి నివాసానికి చేరుకుని పార్థివదేహానికి నివాళులర్పించారు. వారిని కుటుంబీ కులను ఓదార్చి రూ.5వేల నగదు అందజేశారు.

లంబాడిగూడను ఎస్టీ రిజర్వేషన్‌గా మార్చాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

బెజ్జూర్: జనాభా ప్రాతిపదికన మండలంలోని లంబాడిగూడ పంచాయతీని ఎస్టీ రిజర్వేషన్‌గా మార్చాలని గ్రామస్తులు కోరారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ఫిర్యాదుల విభాగంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో 841 జనాభా ఉండగా, 472 ఎస్టీలు ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఎస్సీ రిజర్వేషన్ కొనసాగుతుందని, ఎస్టీ రిజర్వేషన్‌గా మార్చాలని కోరారు. బుక్య సంతోష్ నాయక్, ధరావత్ మంజు నాయక్, సపావత్ కుమార్, హరిప్రసాద్, లావుడ రమేశ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా కాన్షీరాం వర్ధంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: మాన్యశ్రీ కాన్షీరాం 17వ వర్ధంతిని బీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. నాయకులు ముస్తాఫిజ్, పోచం, మనోహర్, అరుణ్, షబ్బీర్ హుస్సేన్, శ్రీనివాస్, శోభన్, షబ్బా, జహీర్, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ



చీరలు అందజేస్తున్న ఎంపీపీ సౌందర్య

రెబ్బెన: మండలంలోని మద్దాయిగూడలో మహిళలకు ఎంపీపీ జుమ్మిడి సౌందర్య సోమవారం బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. సర్పంచ్ డోబే పార్వతి, పంచాయతీ కార్యదర్శి నరేష్, బీఆర్ఎస్ నాయకులు జుమ్మిడి ఆనంద్ పాల్గొన్నారు.

- నంబాల పంచాయతీ కార్యాలయంలో మహిళలకు సర్పంచ్ చెన్న సోమశేఖర్ బతుకమ్మ చీరలు అందచేశారు. పీఏసీఎస్ వైస్ చైర్మెన్ మహేష్‌గౌడ్, వార్డు సభ్యులు భూదేవి, రజిత, మాజీ సర్పంచ్ వెంకటి, పంచాయతీ కార్యదర్శి పుష్పలత పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలో చేర్చాలి



మాట్లాడుతున్న మాలీ సంఘం నాయకులు

కౌటాల: మాలీలను ఎస్టీ జాబితాలో చేర్చాలని మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్‌రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సంఘం భవనంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాలీలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసి సీఎం కేసీఆర్ కేంద్రానికి పంపినట్లు తెలిపారు. పార్లమెంట్‌లో ఈ తీర్మానాన్ని ఆమోదించాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు హన్మంతు, శ్రీనివాస్, రమేశ్, రాము, బాపురావు, శంకర్, సంగీత్‌రావు తదితరులు పాల్గొన్నారు.